## సామాజిక అభ్యుదయవాది బసవన్న

### బసవేశ్వరుడి జయంతి సందర్భంగా కేసీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కుల, వర్ణ, లింగ వివక్షను వ్యతిరేకించిన సామాజిక అభ్యుదయ వాది, వీరశైవ లింగాయత్ ధర్మ వ్యవస్థాపకుడు, బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం బసవన్న జయంతి సందర్భంగా ఆయన చేసిన సామాజిక కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. ధార్మిక ప్రవచనాలు, వచన సాహిత్యం, కార్యాచరణ ద్వారా సమానత్వం కోసం పాటుపడిన సామాజిక విప్లవకారుడు బసవన్న అని కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన దార్శనిక పాలకుడిగా ప్రజల మన్ననలు అందుకున్నాడని తెలిపారు. బసవేశ్వరుడి ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.

# కులగణన చెల్లదు

▶ మొదటిపేజీ తరువాయి...

అంశాలు. 'జనాభాగణన' అంటే మొత్తం ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించడం. 'సర్వే' అనేది నిర్దేశిత లక్ష్యాలతో ఏదైనా ఒక అంశానికి సంబంధించి, మొత్తం జనాభాలో కొంతమందిని శాంపిల్‌గా ఎంపిక చేసుకుని నిర్వహించేది. అందుకు సంబంధించి దేశంలో రెండు రకాల చట్టాలు ఉన్నాయి. జనాభాగణన అనేది 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. జనాభాగణన చట్టం-1948 ప్రకారం.. జనాభాగణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికి మాత్రమే ఉన్నది. జనాభాగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ రాష్ట్రాలు చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండదు. వాటిని అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వమే 'గణాంకాల సేకరణ చట్టం-2008' ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. నిర్దేశిత అంశానికి సంబంధించిన గణాంకాలను సేకరించే అధికారాన్ని రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలు, ఆ తరువాత పంచాయతీలు, మున్సిపాలిటీలకు సైతం కల్పించింది. అదే సమయంలో కొన్ని షరతులను విధించింది. 2017లో ఈ చట్టానికి మరిన్ని సవరణలు చేసింది. 2008 చట్టం ద్వారా 7వ జాబితాలోని జనాభాగణనను రాష్ట్రాలు నిర్వహించకూడదు. అది రాష్ట్రాల పరిధిలోకి రాదు. ఒకవేళ ఏదైనా రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అంతేకాదు, రాష్ట్రాలు సేకరించిన డాటా వెల్లడిపై కూడా అనేక ఆంక్షలు విధించింది. రేవంత్ సర్కారు మాత్రం 'ఇంటింటి సర్వే' అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణనను నిర్వహించి అందరినీ మభ్యపెట్టింది. గణాంకాల సేకరణ చట్టం-2008 ప్రకారం సర్వే నిర్వహించాలంటే కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. రిజిస్ట్రార్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం-1952 ప్రకారం స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వశాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. అంతేకాకుండా నోడల్ ఆఫీసర్‌ను, కమిషన్‌కు సెక్రటరీని కూడా నియమించాల్సి ఉంటుంది. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్, స్టాటిస్టిక్స్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన లేటెస్ట్



ఇండ్ల జాబితాను, బ్లాక్‌ల వారీగా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. సర్వే ప్రశ్నావళి రూపకల్పనకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సేకరించిన డాటాను కూడా అందుబాటులో ఉన్న ప్రామాణికమైన డాటాతో అంటే ఓటర్, ఆధార్, రేషన్‌కార్డు తదితర జాబితాలతో విశ్లేషించాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుది నివేదికను రూపొందించాలి. ఆ నివేదికకు క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఆ తరువాత తుదకు కేంద్రం ఆమోదం పొందిన తరువాతనే ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ,శశ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులగణన అంశంలో ఆ నిబంధనలన్నింటికీ తిలోదకాలిచ్చింది. సర్వే చెల్లబోదని మేధావులు, నిపుణులు నెత్తినోరు కొట్టుకుని చెప్పినా, అటకెక్కిన బీహార్ తదితర రాష్ట్రాల సర్వేలను ఉదహరించినా వినిపించుకోలేదు. కేవలం రాజకీయాల కోసం తప్ప మరేమీ కాదన్నట్టుగా వ్యవహరించింది.

**రూ.160 కోట్లు వృథా!**

ఎలాంటి తులనాత్మక అధ్యయనం చేయకుండానే రేవంత్ సర్కారు రాష్ట్రంలో ఇంటింటి సర్వేను దాదాపు రూ.160 కోట్ల వ్యయంతో నిర్వహించింది. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో గత నవంబర్‌లో ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన) చేపట్టింది. సర్వేకు సంబంధించిన నివేదికను అసెంబ్లీలో వెల్లడించింది. ఆ గణాంకాలపై విమర్శలు వెల్లువెత్తడంతో మళ్లీ రీ సర్వే నిర్వహించింది. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. డాటా ప్రైవేసీ యాక్ట్‌ను ఉటంకిస్తూ కులాలు, ఉపకులాల వారీగా వివరాలను గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయింది. ప్రస్తుతం కేంద్ర మంత్రి ప్రకటనతో ఈ గణాంకాలు కూడా బుట్టదాఖలు కానున్నాయి. దీంతో రూ.160 కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది.

### కులగణనకు ఆదినుంచీ బీఆర్ఎస్ మద్దతు

**కులగణన** కోసం ఓబీసీ వర్గాలు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తూ ఉన్నాయి. 2014 ఎన్నికల సమయంలోనే బీజేపీ సర్కారు కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటివరకు నిర్వహించలేదు. సున్నితమైన అంశం అంటూ దాటవేస్తూ వచ్చింది. ఓబీసీ వర్గాల కులగణన డిమాండ్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదినుంచీ అండగా నిలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి నాళ్లలోనే జనగణనలో కులగణన చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. అదేవిధంగా, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. యూపీఏ-1 ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా ఉన్న సమయంలోనే బీసీ సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలని నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ వర్గాల కులగణన కోసం ప్రతి సందర్భంలోనూ కేసీఆర్ గళం విప్పారు. బీసీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి పదేండ్ల పాలనలో విప్లవాత్మక పథకాలను అమలు చేశారు.

### లోకం పోకడ




**ఇందిరమ్మ ఇండ్లు రానివాళ్లు సార్.. నిరసన చేసుకోవడానికి వాళ్లకు ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్ అయినా కట్టించమంటున్నారు!**

## కులగణనపై సర్వత్రా హర్షం

### కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయపక్షాలు, ఓబీసీ వర్గాల కృతజ్ఞతలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): జనగణనతోపాటు కులగణన చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు, ఓబీసీ వర్గాల నేతలు స్వాగతించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఇది బీఆర్ఎస్ చేసిన పోరాట ఫలితమని, బీసీల విజయమని చెప్పారు. జనగణనలో కులగణన చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్, ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ గుర్తుచేశారు. చట్టసభలలో బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించాలని కూడా కేసీఆర్ హయాంలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇది తరతరాలుగా ఎదురుచూస్తున్న బీసీ మహాజనావళి ఆకాంక్షల విజయమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో సీట్ల పెంపు.. జనగణన తర్వాతే!

### సుప్రీంకు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ • తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): రాత్రికి రాత్రే డీలిమిటేషన్ చేపట్టలేమని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 2026 జనాభా గణన తర్వాతే ఏపీ, తెలంగాణలో సీట్ల సంఖ్య పెంపునకు సంబధించిన ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ హాజరై వాదనలు వినిపించారు. జనగణన వరకు ఎదురుచూడాల్సిందేనని తెలిపారు. జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం కావడం వల్లే అక్కడ సీట్ల పెంపు జరిపినట్టు వెల్లడించారు. తెలంగాణ, ఏపీలో అసెంబ్లీ స్థానాలు పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కే పురుషోత్తంరెడ్డి 2022 జూన్ 7న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ, ఏపీని మినహాయించి జమ్ముకశ్మీర్ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు మాత్రమే డీలిమిటేషన్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని 2022లో ప్రతివాదులైన కేంద్రం, ఈసీ, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను ముగించింది. సుదీర్ఘ వాదనల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు తెలిపింది.

## ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

- హైకోర్టులో ముగిసిన వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టీ ప్రభాకర్‌రావు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ వేసిన సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే హార్డ్‌డిస్క్, పరికరాల ధ్వంసం జరిగిందన్న వాదనను వ్యతిరేకిస్తూ.. రివ్యూ కమిటీ ఆదేశాల మేరకే వాటిని ధ్వంసం చేశారని తెలిపారు. తర్వాత పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు వాదిస్తూ ప్రభాకర్‌రావుకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఇంప్లీడ్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ శ్రీనివాసరావు ప్రకటించారు.

### ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఓ మెమో జారీచేసింది. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ పొందే అవకాశాన్ని ఈ నెల 3వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపింది.

## కమలాసన్‌రెడ్డి తిరిగి నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి బుధవారం పదవీ విరమణ చేసిన వీ కమలాసన్‌రెడ్డిని ప్రభుత్వం తిరిగి నియమించింది. సర్వీసును మరో రెండేండ్లు పొడిగించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో ఓఎస్డీగా నియమించడంతోపాటు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌ను వెంటనే సీఎస్‌కు రిపోర్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా, ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ముందే చెప్పింది. 'ఇద్దరు ఐజీలకు పదవీకాలం పొడిగింపు?' పేరిట మంగళవారం కథనాన్ని ప్రచురించింది.

## ఐపీఎస్‌లకు ఎదురుదెబ్బ!

▶ మొదటిపేజీ తరువాయి...

ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ఎత్తివేయాలంటూ పలువురు ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ ముగిసినట్టు డివిజన్ బెంచ్ ప్రకటించింది.

**మా వాదనలు వినలేదు**

తొలుత ఐపీఎస్ అధికారుల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ల వాదనలు వినకుండా, కనీసం నోటీసు కూడా జారీ చేయకుండా సింగిల్‌జడ్జి ఉత్తర్వులు జారీచేయడం చెల్లదని అన్నారు. బీర్ల మహేశ్ (ప్రతివాది) ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంపై ఏం చర్యలు తీసుకున్నదీ నివేదిక కోరారని, అయితే, ఆయన కోరని అంశాల్లోకి సింగిల్ జడ్జి వెళ్లి అప్పీల్ పిటిషనర్ల భూములను నిషేధిత జాబితాలో ఉంచాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీచేయడం చట్ట వ్యతిరేకమని అన్నారు. ఊహాజనితమైన ఆరోపణలతో దాఖలు చేసిన పిటిషన్‌పై వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

**భూహక్కులకు ఎక్కడ నష్టం జరిగిందో చెప్పండి..**

పిటిషనర్ల వాదనపై స్పందించిన ధర్మాసనం.. సింగిల్ జడ్జి వెలువరించింది మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే కదా అని పేర్కొంది. మధ్యంతర ఉత్తర్వులు ప్రత్యక్షంగా ప్రభావాన్ని చూపవు కదా? భూ యాజమాన్య హక్కులకు నష్టమేమీ జరుగలేదు కదా? కాబట్టి సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో ఎలా జోక్యం చేసుకోవాలో చెప్పండి? అని ప్రశ్నించింది. దీనిపై న్యాయవాదులు స్పందిస్తూ, సింగిల్ జడ్జి ఆర్డర్ వల్ల ఈడీ, సీబీఐ, సీవీసీ రంగంలోకి దిగే అవకాశం ఉందని, రేపే తమ స్థలాలను పరిశీలిస్తే పిటిషనర్ల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ధర్మాసనం కల్పించుకుని అప్పీల్‌దారుల హక్కులపై ప్రభావం చూపే విధంగా సింగిల్‌జడ్జి తుది ఉత్తర్వులు ఇవ్వలేదని గుర్తుచేసింది. మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

## టెండర్లు పంచుకున్న మంత్రులు?

▶ మొదటిపేజీ తరువాయి...

తప్పుకున్నాయి. మరి.. ఇవేవో వందలు, వేల కోట్ల పనులు కూడా కాదు. నాలుగుచోట్ల పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనుల అంచనా వ్యయం రూ.100కోట్లలోపే ఉందంటే అధికార పార్టీ నేతలు ఏ చిన్న కాంట్రాక్టును సైతం వదలడంలేదని స్పష్టంగా తెలుస్తున్నది.

**కాంట్రాక్టు కోసం మంత్రులు, ఎమ్మెల్యే పోటీ**

వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి-భువనగిరి, పరకాల నియోజకవర్గాల పరిధుల్లో పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు టీజీఐఐసీ టెండర్లు రూపొందించింది. ఈ మేరకు నాలుగుచోట్ల వివిధ అంచనా వ్యయాలతో టెండర్లు పిలవగా... సాధారణ కాంట్రాక్టర్లు సైతం పాల్గొన్నారు. కానీ ఈ శాఖతో అసలు సంబంధమేలేని ఇద్దరు మంత్రులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు ఈ టెండర్లపై ఓ నజర్ వేశారు. ఇందులో కొందరికి నేరుగా కొన్ని కంపెనీలతో సంబంధం ఉండగా.. మరికొందరు తమ అనుచరులకు సంబంధించిన కంపెనీల కోసం పనుల పందేరంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా యాదాద్రి-భువనగిరి జిల్లా పరిధిలోని దండు మల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఫేస్-2 అభివృద్ధికి సంబంధించి రూ. 34.11 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఈ పనుల కోసం ఇద్దరు మంత్రులు పోటీపడ్డారు. వీరిలో ఒకరు కాంట్రాక్టు పనుల్లో ఆరితేరి.. అనుభవం ఉండి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు కాంట్రాక్టులు దక్కించుకోవడమే పరమావధిగా పెట్టుకున్నారు. మునుపు ఇలాంటి అనుభవం లేకున్నా పోటీపడితే పోయేదేముంది! అన్నట్టు తనకు చెందిన వారి కంపెనీ కోసం మరో మంత్రి 'చక్రం' తిప్పారు. స్థానిక ఎమ్మెల్యే సైతం తానేమీ తక్కువ కాదన్నట్టు.. అసలే నా ఇలాఖా... తనకే పనులు కావాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో కాంట్రాక్టులు దక్కించుకోవడంలో సిద్ధహస్తుడైన ఒక మంత్రి నిరుడు మాదిరిగానే ఈసారి కూడా అవు కథ వినిపించినట్టు సమాచారం. దీంతో చివరకు ఆయన మాటనే నెగ్గడంతో సదరు మంత్రివర్యులు చెప్పిన కంపెనీకే పనులు దక్కినట్టు తెలిసింది. అయితే ఇందులో ఇంకో మతలబు ఉన్నది. ఈ టెండర్లలో ఆ కంపెనీ కంటే తక్కువ కోడ్ చేసిన వారిని సైతం పక్కనబెట్టి అమాత్యులు చెప్పిన వారికే పనులు ఇవ్వాలని నిర్ణయించడం మంత్రులు-అధికారుల మధ్య మంచి అవగాహన ఉందనేది నిదర్శనం.

**మిగిలిన చోట్లా ఇదే బాపతు...**

వికారాబాద్ జిల్లా ఎనకతల గ్రామ పరిధిలో రూ.44 కోట్లతో చేపడుతున్న ఇండస్ట్రియల్ పార్క్ పనులను ఉన్నత పదవిలో ఉన్న బడానేత పట్టుబట్టి మరీ తన అనుచరుడికి ఇప్పించుకున్నట్టు తెలిసింది. అదేవిధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండల పరిధిలోని మాదారంలో రూ.14 కోట్లతో చేపడుతున్న పనులకు కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే పోటీపడినట్టు తెలిసింది. ఇక వరంగల్ జిల్లా గీసుకొండలోని కేఎంటీపీ ఫేస్-2లో భాగంగా సుమారు రూ.6 కోట్లతో చేపడుతున్న పనులను మరో ఎమ్మెల్యే తన మనుషులకు ఇప్పించుకున్నట్టు కాంట్రాక్టర్లు చర్చించుకుంటున్నారు. తామెలా బతకాలంటూ కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

## టీజీపీఎస్సీకి చుక్కెదురు

### గ్రూప్-1 కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వుపై జోక్యానికి బెంచ్ నిరాకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 30, (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 నియామకాల ప్రక్రియ పూర్తి చేయరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును రద్దు చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ చేసిన అప్పీల్‌పై విచారించేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారం సింగిల్ జడ్జి వద్ద ఉందని, ఆయన వద్దనే తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మధ్యంతర ఉత్తర్వులపై ఏ నిర్ణయమైనా సింగిల్ జడ్జే తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ వివాదాన్ని హైకోర్టుకు వేసవి సెలవుల్లోగానే పరిష్కరించాలని సింగిల్‌జడ్జికి సూచించింది. తొలుత టీజీపీఎస్సీ తరపు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. గ్రూప్-1 పోస్టుల నియామకాలన్నీ నిలిచిపోయాయని, ఇతర ప్రక్రియ అంతా పూర్తిచేశామని చెప్పారు. తమ వాదనలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోకుండానే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. సింగిల్ జడ్జి వద్ద మధ్యాహ్నం విచారణ జరగనుందని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, మరి ఇంతలోనే తమ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది.

## గ్రూప్-1 సందేహాలపై సమాధానం చెప్పండి

### టీజీపీఎస్సీ చైర్మన్‌కు కేంద్రమంత్రి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 అక్రమాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశానికి బుధవారం లేఖ రాశారు. అభ్యర్థులు లేవనెత్తిన పలు సందేహాలను ఆ లేఖలో బండి సంజయ్ ప్రస్తావించారు. వారం రోజుల్లో సమగ్ర సమాచారాన్ని అందజేయాలని కోరారు. మార్కుల ప్రకటన, నోటిఫికేషన్ ఉల్లంఘన, పరీక్ష పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతో పాటు ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు రావడాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. మరో వైపు హైకోర్టులో గ్రూప్-1 కేసు విచారణ కొనసాగుతుండటంతో టీజీపీఎస్సీ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా అవసరమైతే తాను సైతం ఇంప్లీడ్ కావాలని బండి సంజయ్ నిర్ణయించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో అవినీతి, అక్రమాలు, తప్పిదాలకు తావు లేకుండా మెరిట్ ప్రాతిపదికగా ఉద్యోగ నియామకాలు జరిగేలా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించుకున్నారు.

# తెలుగులో రాస్తే మార్కులు రావా?

▶ మొదటిపేజీ తరువాయి...

అప్పీళ్లపై డివిజన్ బెంచ్ విచారణకు నిరాకరించింది. దీంతో ప్రధాన పిటిషన్‌పై సింగిల్ జడ్జి వద్ద వాదనలు కొనసాగాయి.

**తెలుగు అనువాదానికి ఏది ప్రాతిపదిక**

మెయిన్ మూల్యాంకనానికి అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరాలు కోర్టు కోరింది. మూల్యాంకనం చేసేందుకు నియమించిన వారిలో తెలుగులో ప్రావీణ్యమున్న వారెందరో చెప్పాలని నిలదీసింది. తెలుగు మాధ్యమం పట్ల చిన్నచూపు ఉంటే ఎలాగని, ఆ భాషపై సాధికారత ఎలా సాధించగలమని ప్రశ్నించింది. మార్కులు కేటాయించడానికి ఏదైనా 'కీ' ఉందా అని కూడా ప్రశ్నించింది. ఒక ప్రశ్నకు తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూల్లో జవాబు రాసిన వారికి ఏ ప్రాతిపదికన మార్కులు కేటాయిస్తారు అంటూ కీలక ప్రశ్న వేసింది, తెలుగులో అనువాదం, వాస్తవ అనువాదం, స్వేచ్ఛానువాదం ఇలా రెండు రకాలు ఉంటుంది కదా దేనిని ప్రాతిపదికగా తీసుకుంటారని అడిగింది.

**అన్నీ అవకతవకలే..**

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాదులు సురేందర్, విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ, పరీక్షల నిర్వహణలో అడుగడుగునా అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. చాలాచోట్ల నిబంధనలు ఉల్లంఘించారని, ఆపై నిర్దేశించిన కేంద్రాల్లో పరీక్షలు రాసిన అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. అన్ని అంశాలను పరిశీలిస్తే గ్రూప్-1 పోస్టుల కోసం ఎదురుచూసిన చాలామంది మోసపోయారని అర్థమవుతున్నట్టు చెప్పారు. ప్రిలిమ్, మెయిన్‌కు హాల్‌టికెట్లు మార్చారని, ఎందుకు మార్చారో చెప్తున్న కారణాలకు పొంతన లేదని తెలిపారు. కొందరికి అనుకూలంగా సెంటర్లు వేయడం కోసమే హాల్‌టికెట్లను మార్చారని చెప్పారు.

**అక్రమాల పుట్ట..**

గ్రూప్-1కు ఎంపికైన మహిళా అభ్యర్థులు 18, 19 నంబర్లతో ఉన్న కేంద్రాలు పరీక్ష రాశారని, ఈ రెండు కేంద్రాలకు మహిళా అభ్యర్థులను ఎలా ఎంపిక చేశారో, ఈ సెంటర్లు ఎందుకు, ఎలా ఇచ్చారో, ఇందుకు ఏ నిబంధనలను అనుసరించారో చెప్పాలని న్యాయవాదులు కోరారు. మరికొన్ని చోట్ల కూడా మహిళా కాలేజీల్లో సెంటర్లు వేసినప్పటికీ అక్కడ పురుషులు, మహిళలు కలిసే పరీక్ష రాశారని తెలిపారు. కేవలం నాలుగంటే నాలుగు కేంద్రాల్లో పరీక్ష రాసిన అభ్యర్థులే గ్రూప్-1 పోస్టులకు అర్హత సాధించడం వెనుక ఉన్న గుట్టును, అ అభ్యర్థుల్లో ఉన్న ప్రతిభ ఏపాటిదో నిగ్గు తేల్చాలని అన్నారు. 16, 17, 18, 19 నంబరు సెంటర్లలో పరీక్ష రాసిన వారే ఎక్కువ శాతం అర్హత సాధించారని చెప్పారు. పక్క పక్కనే కూర్చున్న వందల మంది అభ్యర్థులకు ఒకే తీరుగా మార్కులు రావడం వెనుక దాగిన చిదంబర రహస్యాన్ని బట్టబయలు చేయాలని కోరారు.

**నోటిఫికేషన్ రద్దు అధికారం లేదు**

'గ్రూప్-1 పరీక్షల నోటిఫికేషన్‌ను ఇదే హైకోర్టు గతంలో రద్దుచేసింది. 2022 నోటిఫికేషన్ ప్రకారం మొత్తం ఖాళీలు 503 ఉన్నాయి. అదనంగా 60 ఖాళీల భర్తీకి ప్రభుత్వం జీవో 16 జారీచేసింది. దీంతో ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త పోస్టులతో కలిపి 563 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ వెలువరించింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడకపోయినా రెండింటికీ కలిపి ఒకే నోటిఫికేషన్ జారీచేసింది. ఒక నోటిఫికేషన్‌ను రద్దు చేసే అధికారం టీజీపీఎస్సీకి లేదు' అని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు.

**నాలుగు సెంటర్లల్లో 74% ఉత్తీర్ణత**

టీజీపీఎస్సీ ఎంపికచేసిన కొంతమందికి లబ్ధి చేకూరేలా చేసిందని న్యాయవాదులు ఆరోపించారు. 'కేవలం 4 సెంటర్ల నుంచి ఏకంగా 162 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 16, 17, 18, 19 సెంటర్లలో 74 శాతం మంది అర్హత సాధించారు. మిగిలిన సెంటర్లలో 5 శాతం కంటే తక్కువ అర్హత సాధించారు. కొన్ని సెంటర్లలో ఒకరిద్దరు కూడా అర్హత పొందలేదు. కోఠి మహిళా కళాశాల వారి అభ్యర్థన మేరకు అక్కడ కేవలం మహిళలనే కేటాయించామని టీజీపీఎస్సీ చెప్తున్నది. మహిళా కళాశాల అయినందున మహిళలను కేటాయించామని చెప్తున్నపుడు మిగిలిన 9 మహిళా కాలేజీల విషయంలో అదే పద్ధతిని ఎందుకు అమలు చేయలేదు? 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పి పోలీసు రక్షణ కోరుతూ లేఖ రాసిన టీజీపీఎస్సీ ఆ తర్వాత అదనంగా మరో సెంటర్‌ను ఎందుకు పెంచింది' అని ప్రశ్నించారు.

**వివరాలు ఎలా బయటకు వెళ్లాయి?**

మూల్యాంకనం చేసిన వాళ్ల వివరాలు పిటిషనర్ల తరపు న్యాయవాదులకు ఎలా చేరాయని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది ప్రశ్నించారు. విద్యాశాఖ కమిషనర్, టీజీపీఎస్సీకి మాత్రమే తెలిసిన సమాచారం వాళ్లకు ఎలా చేరిందని సందేహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేయాలని పోలీసులను కోరాల్సిన అవసరముందని అన్నారు. మల్లిక్ అనే ప్రొఫెసర్ చేవెళ్ల ప్రభుత్వ కళాశాలలో పని చేస్తుంటే ప్రైవేట్ ఉద్యోగి అని చెప్పడం సరికాదని అన్నారు. గురువారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.



### తెలంగాణ చరిత్ర ఘట్టాల క్రమం ఉండాలి కదా?

**తెలుగు**, ఇంగ్లిష్, ఉర్దూ.. భాషల వారీగా మూల్యాంకనం చేసే వాళ్లకు జవాబు పత్రాలు ఇచ్చారా అని టీజీపీఎస్సీని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై టీజీపీఎస్సీ న్యాయవాది రాజశేఖర్, మెయిన్ పరీక్షల ప్రశ్నలు వ్యాసం రూపంలో ఉంటాయని, వాటికి జవాబు పత్రాలు ఇవ్వడం సాధ్యంకాదని చెప్పారు. ఆయా సబ్జెక్టుల్లో నిపుణులే పేపర్లు దిద్దుతారని, వాళ్లకు జవాబుపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. మూల్యాంకనం చేసే వాళ్లకు జవాబు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్న టీజీపీఎస్సీ వాదనపై కోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పే విధంగా పేపర్ ఉండదు అన్న వాదనపై బెంచ్ కల్పించుకుంటూ.. 'ఉదాహరణకు తెలంగాణ ఉద్యమం గురించి అడిగిన ప్రశ్నకు జవాబు మూసపోసినట్టుగా ఉండదు. తెలంగాణ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది.. ఎప్పుడు ముగిసింది.. ఈ క్రమంలో చోటుచేసుకున్న అనేక ఘట్టాలు, అంశాలు.. వీటి గురించి జవాబు ఫలానా వరస క్రమంలో (అంశాలు/ఘట్టాలు) ఉండాలని మూల్యాంకనం చేసేవాళ్లకు తెలియాలి కదా' అని ప్రశ్నించింది.

### తేడాలను టీజీపీఎస్సీనే అంగీకరించింది

మూల్యాంకనం చేసేందుకు తగిన స్థాయిలో సిబ్బందిని కేటాయించలేదని న్యాయవాదులు చెప్పారు. ప్రతి ఐదు నిమిషాలకో పేపర్ మూల్యాంకనం చేయాలని వారికి చెప్పారని, సంప్రదాయ విధానంలో (డిజిటల్ కాకుండా) మూల్యాంకనం చేసిన వారిలో చాలామంది డిగ్రీ కాలేజీ లెక్చరర్లు కూడా ఉన్నారని తెలిపారు. మెయిన్ పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలో కూడా తేడా ఉన్న విషయాన్ని టీజీపీఎస్సీ స్వయంగా అంగీకరించిందని చెప్పారు. పరీక్షల అనంతరం సూపరింటెండెంట్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా హాజరైన అభ్యర్థుల సంఖ్యను 21,075 అని ప్రకటించినట్టు, ఆ తర్వాత జవాబు పత్రాలు ఓఎంఆర్, నామినల్ రోల్స్ మొత్తం బేరీజు వేశాక ఆ సంఖ్య 21085కు పెరిగినట్టు టీజీపీఎస్సీ ఒప్పుకోవడం అంటే అక్రమాలు జరిగినట్టేనని అన్నారు. పదిమంది పెరగడం, ఎంపిక చేసిన వారే అత్యధికంగా అర్హత సాధించడం, హాల్‌టికెట్లను మార్చడం వంటివి గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనాలు, సాక్ష్యాలు అని చెప్పారు. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో మొత్తం మార్కుల జాబితాను మార్చి 10న అప్‌లోడ్ చేసిందని, పేపర్ల వారీగా మార్కులను ఆ తర్వాత వారం రోజులకు అప్‌లోడ్ చేసిందని, ఆ తర్వాత పూర్తి వివరాలను మార్చి 30న అప్‌లోడ్ చేసిందని, ఇందుకు దారుణమైన అవకతవకలే కారణమని ఆరోపించారు.

## వృద్ధుల కోసం జీరియాట్రిక్ క్లినిక్‌లు!

### త్వరలో జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు

### మెడికల్ కాలేజీల్లో అందుబాటులోకి..

### ఆర్థో, సైకలాజికల్, ఈఎన్‌టీ, జనరల్ ట్రీట్‌మెంట్లకు ప్రాముఖ్యత

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : 65 ఏండ్లు పైబడిన వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జీరియాట్రిక్ క్లినిక్‌లు ఏర్పాటుచేయనున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ దవాఖానల్లో వీటిని ఏర్పాటుచేస్తారు. వీటిలో ఓపీ, ఐపీ సేవలు అందించనున్నారు. ఇన్‌పేషంట్ల కోసం ఒక్కో క్లినిక్‌లో 30 బెడ్లు ఏర్పాటుచేస్తారు. ఈ క్లినిక్‌లలో ఆర్థో, సైకలాజికల్, ఈఎన్‌టీ, జనరల్ ట్రీట్‌మెంట్లకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఈ మేరకు డీఎంఈ నరేంద్రకుమార్ అన్ని జిల్లాల మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చారు.

**ప్రత్యేక క్యాంపుల ద్వారా గుర్తింపు..**

చాలామంది పేరెంట్స్‌ను పట్టించుకోకపోవడం, వారి ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. క్షేత్రస్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పల్లె దవాఖానల్లోని స్టాఫ్, ఆశలు, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా వృద్ధులను గుర్తించి జిల్లా స్థాయిలోని జీరియాట్రిక్ క్లినిక్‌కు పంపిస్తారు. హెల్త్ కండీషన్‌పై ప్రతినెలా క్షేత్రస్థాయి హెల్త్‌స్టాఫ్ ఆయా క్లినిక్‌లకు రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితో వృద్ధుల ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు తీసుకురావచ్చని డీఎంఈ నరేంద్రకుమార్ స్పష్టంచేశారు. ఇక ఈ క్లినిక్‌లకు నోడల్ కేంద్రంగా నిమ్స్ వైద్యశాల పని చేయనున్నది. క్లినిక్‌లకు వచ్చిన క్రిటికల్ కండీషన్ పేషెంట్లను రెఫరల్ విధానంతో నిమ్స్‌కు షిఫ్ట్ చేయనున్నారు. మరికొన్ని కేసులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సీనియర్ల ప్రొఫెసర్ల బృందం పని చేయనున్నది.